# తల్లిచాటు...

టెలిగ్రామ్ అందుకున్న గోపాల్ మరో గంటలో బయలుదేరే రైలు అందుకోవాలని ఆదరా, బాదరాగా బయలుదేరి తణుకు చేరుకున్నాడు.

రైలెక్కిన దగ్గరనుంచీ గోపాల్ మనసులో కోటి ఆలోచనలు... "అమ్మ ఎలాగుందో!? అమ్మ బతికుండగా చూస్తానా? ఎంత సీరియస్‌గా లేకపోతే టెలిగ్రా మిస్తారు!! భగవాన్! ఆ మహాతల్లిని ఆఖరి దశలో చూసే భాగ్యం కలిగించు తండ్రీ! ఆ మాతృమూర్తి ఎంత కష్టపడి, ఎన్ని బాధలుపడి మా అందర్నీ యింతింత వాళ్ళని చేసింది! మధ్య తరగతి కుటుంబాలలో ఎదుర్కొనే యిబ్బందుల్నే తమ ఇంట్లోనూ ఎదుర్కొనేవారు. తండ్రి కొచ్చే గుమస్తా జీతంలో ఇల్లు గడుపుతూ, చదువులు చెప్పిస్తూ అక్క లిద్దరి పెళ్ళిళ్ళు జరిపించారు. తను మధ్యవాడు. తన తరువాత మరో యిద్దరాడపిల్లలు, మరో మగ పిల్లవాడు. బి.కాం. ఆఖరి సంవత్సరంలో ఉన్నాడు. ఆడ పిల్ల లిద్దరూ కూడా పెళ్ళి కెదిగి కూర్చున్నారు. అదృష్టవశాత్తూ తన చదువయిన వెంటనే ఓ పెద్ద మనిషి రికమెండేషన్ వల్ల ఓ వెయ్యి రూపాయల ఉద్యోగం వచ్చింది. పట్నంలో తన ఖర్చులకి పోగా కొంత యింటికి పంపేవాడు. కానీ ఏడాది క్రితమే తండ్రి తనపై పూర్తి బాధ్యతని మోపి ఈ లోకం నుంచే నిష్క్రమించాడు. కుటుంబాన్నంతా పట్నం తీసుకొద్దామంటే డబ్బు చాలదన్న భయంతో, వాళ్ళనక్కడే ఉంచి, పొలం రెండెకరాల మీద వచ్చే గింజలకి, తను కొంచెం పంపి కాలక్షేపం అయ్యేలా చూస్తున్నాడు.

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ గుండె దడ అధిక మవసాగింది. రిక్షాదిగి పరుగు పరుగున లోపలి కెళ్ళాడు. కొడుకుని చూసి ఎదురొచ్చిన కామాక్షమ్మ, గోపాల్‌ని కౌగిలించుకుని ఘొల్లున ఏడవడం ప్రారంభించింది.

'మదర్ సీరియస్ అన్న టెలిగ్రామేమిటి? ఆ మదరే ఎదురొచ్చి కౌగిలించుకొని ఏడవట మేమిటి?" గోపాల్ మతిపోయింది. మంచి నీళ్ళ గ్లాసుతో వచ్చిన చెల్లెలు గోపాల్ చేతిలోని పెట్టి అందుకుని గదిలో పెట్టింది.

"బాబూ యింటికి పెద్ద వాడివి, నీ తరవాత యిద్దరాడ పిల్లలున్నారు. తండ్రి లేని వాళ్లకి నువ్వే తండ్రి వయి పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఎన్ని కష్టాలో పడి, నా చీమూ, రక్తం మీకే ధారపోసి ఇంతింత వాళ్ళని చేసానురా! నా జీవితమంతా మీ కోసమే పాటు పడ్డాను.

"అలాంటి దీనాడు అవన్నీ మర్చిపోయి యిలాంటి పని చేస్తే మా బతుకులేమవ్వాలిరా?!" అంటూ కొడుకుని చుట్టేసుకుని గోల గోల పెడుతున్న తల్లిని చూసి గోపాల్ "ఏమయిందమ్మా! ఇప్పుడూ? ఎందుకు అంతలా బాధ పడుతున్నావు? నిన్నేమన్నానమ్మా! ఏం నొప్పించే పని చేసాను? ఏం తప్పు చేసానో చెప్పు. అంతేగానీ అలా బాధపడకమ్మా!" అంటూ తల్లి భుజం మీద చేయి వేసి అనునయంగా అడుగుతున్న గోపాల్‌కి కామాక్షమ్మ బల్లమీదున్న ఉత్తరం అందించింది.

అది చదివి మరోసారి షాకయి పోయి వెర్రిముఖం వేసుకుని తల్లివైపు చూసాడు గోపాల్.

"అయితే యిది పెద్ద మామయ్య చేసిన పనన్నమాట" అనుకున్నాడు మనసులోనే.

తలొంచుకు నిల్చున్న కొడుకుని చూస్తూ "ఎవరురా! ఆ కుందన? కులం, మతం లేనిదని కూడా రాసాడు! ఎంత వరకు వచ్చిందిరా వ్యవహారం!! పెళ్ళి చేసుకుంటారని అంతా అనుకుంటున్నారుట! ఈ విషయాలు ఉత్తరంలో రాస్తే రావని అలా టెలిగ్రామిప్పించానురా! మమ్మల్ని అన్యాయం చెయ్యకురా!" అంటూ మళ్ళా ఏడవడం ప్రారంభించిన తల్లిని ఊరడిస్తూ, రెండు చేతుల్ని పట్టుకుని, "ఏదో పొరపాటయి పోయిందమ్మా! ఇంకెప్పుడూ అలా చెయ్యనులే! ఆ అమ్మాయి మా ఆఫీసులోనే పని చేస్తుంది. ఊరికే కలిసి తిరుగుతున్నామంతే! నువ్వేంబెంగెట్టుకోకు. వ్యవహారం ఏమీ ముదరలేదు. కిట్టని వాళ్ళు అలా పుట్టించి మామయ్యకి చెప్పి వుంటారంతే!" అంటూ అబద్ధాన్ని అతి జాగ్రత్తగా ఆడి నిజాన్ని కప్పెట్టేడు గోపాల్.

"అయితే రేపు మంచిది. మొన్న రాయుడు గారు తీసుకొచ్చిన సంబంధం చూసి పిల్ల నచ్చితే పెళ్ళి చేసుకుని మరీ వెళ్ళు. కట్నం కూడా నలభైదాకా యిస్తామన్నారుట" అంది మళ్ళీ కళ్ళ నీళ్ళతో.

తల్లి కళ్ళల్లో తడి చూడలేని గోపాల్ మంచు ముక్కలా కరిగిపోయి మర్నాడు బుద్ధిగా వెళ్ళి పిల్లని చూసి తాంబూలాలు పుచ్చుకుని మరో పది రోజుల్లో ఉన్న ముహూర్తానికే మూడు ముళ్ళూ వేసి భార్యతో సహా తిరుగు ప్రయాణమయ్యాడు.

తనకి పుచ్చుకున్న కట్నానికి, తండ్రి కొచ్చిన ప్రావిడెంట్ ఫండుని జోడించి తల్లి, చెల్లెళ్ళ పెళ్ళిల్లు మరో ఏడాదిలోకానిచ్చింది. బి.కాం పూర్తి చేసిన తమ్ముడికి

అస్సాంలో ఉద్యోగం వచ్చింది. ఈ మధ్యలో మరో ప్రమోషన్ కూడా అందుకుని అసిస్టెంట్ మేనేజర్ అయిన గోపాల్ తల్లిని కూడా తన దగ్గరికి తీసుకొచ్చాడు.

కొడుకు పంచన కామాక్షమ్మ జీవితం హాయిగా సాగిపోతోంది. కోడలు అన్నీ కాళ్ళ దగ్గరకి అందిస్తుంటే, మనుమరాలితో కాలక్షేపం చెయ్యడమే కాకుండా, తన పిల్లల అదృష్టాన్ని, నమ్రతని పదే పదే తల్చుకుని గర్వపడటమే కాకుండా, ఇంటి కొచ్చే బంధు మిత్రులతో, తనెంత తీరుగా పిల్లల్ని పెంచిందీ, ఎంత కష్టపడి పెంచిందీ, చెప్పిన వాళ్ళకే చెప్పి ఆనందించడం దినచర్యలో ఓ భాగం అయిపోయింది.

ఎంత రాత్రి వేళప్పుడు వచ్చినా ముందుగా తల్లి గదిలోకి వెళ్ళి, ఆమె భోజనం చేసిందీ, లేనిదీ అడిగి, ఆమె యోగక్షేమాలడిగిన తరవాతే మరో పనిలోకి వెళ్ళేవాడు. తల్లి మనస్సా పలుకరింపుతో పొంగిపోయి, కట్టలు తెంచుకున్న గోదావరిలా ఉప్పొంగి పోయి, ఆ ఆనందం కన్నీళ్ళ రూపంలో ప్రవహించి కొడుకుని పొగిడేసేది. "బాబూ మీ నాన్నే బతికుంటే మిమ్మల్నిలా చూసి ఎంతలా ఆనందపడే వారో కదా? ఆయనకి ప్రాప్తం లేదురా! నువ్వింత వృద్ధిలోకొచ్చి, యింత ఉద్యోగస్తుడి వైనా కన్నవాళ్ళ పట్ల, తోడబుట్టిన వాళ్లపట్ల నీ కర్తవ్యాన్ని బాధ్యతగానే కాకుండా ఎంతో ప్రేమాభిమానాలతో నిర్వహిస్తున్నందుకు ఎంతలా పొంగి పోయి, గర్వపడేవారో కదా? ఆ మహానుభావుడి కా అదృష్టం లేదురా!" అంటూ కళ్ళు ఒత్తుకునేది.

"అత్తయ్య గారూ! పడుకున్నారా?" అంది రూప అత్తగారి గదిలో కొస్తూ. "ఏమే అమ్మా! ఏమన్నా పనుందా?" అంది మంచం మీద నుంచి లేచి కూర్చుంటూ.

ఏదో చెప్పాలన్న తపన రూప ముఖంలో కనపడిందామెకి. "ఏమయిందే మాట్లాడవేం?" అంది తలొంచుకు కూర్చున్న కోడలి వైపు చూస్తూ.

"అత్తయ్య గారూ! మీ అబ్బాయి తన ఆఫీసులో పని చేసే కుందన అన్న అమ్మాయిని ఉంచుకున్నారుటండీ! రాత్రి పొద్దు పోయే దాకా దాని తోనే గడిపి యింటి కొస్తున్నారుటండీ! దానితో రోజూ సినిమాలకీ, షికార్లకీ తిరుగుతుంటే చూసిన వాళ్ళు చెప్పారు. మొన్న మా పిన్ని కూతురు వెళ్ళిన సినీమాకే వాళ్ళూ వెళ్ళి ఆ హాల్లో సరసాలుటండీ! నేనే ఆయన్నడుగుదామనుకున్నాను. కానీ ఆయనకి మీరు తల్లి - మీరంటే ఉన్న గౌరవానికీ, భయానికీ గట్టిగా కేకలేస్తే ఆ పని మానేస్తారని నా ఉద్దేశ్యం. మీరే బాగు చెయ్యాలి. అదలా ముదిరి పోతే నాదీ, పిల్లదీ జీవితం ఏమవుతుందో! అని భయంగా ఉందండీ! మన పరువు బజారు పాలవకుండా, యింకా ముదర కుండా మీతో చెప్దామని వచ్చానండీ"! అంటూ కళ్ళ నీళ్ళెట్టుకున్న కోడల్ని చూస్తూ "ఏమిటే రూపా! చదువుకున్న దానివి! మరీ యింత మూర్ఖంగాప్రవర్తిస్తున్నా

వేమిటే! మగవాడు - ఆఫీసులో పది మంది ఆడా, మగాతో కలిసి పని చేస్తూ వుంటాడు. ఏ పనిమీదో కలసి వెళ్ళి, ఏకారణంగానో ఓ సినీమా కెళ్ళి నంత మాత్రాన చెడు దృష్టితో చూసి, పాడు ఆలోచనల్తో వాడిని తిట్టడమా?" అంది కామాక్షమ్మ.

"మనూరి రామాయమ్మ గారిని చూసావు కదా? ఆమె భర్త అరవైయ్యేళ్ళొచ్చినా రోజూ భోగం దానింటి కెళ్ళొచ్చేవాడు. ఒక్కనాడు ఆ మహాయిల్లాలు పల్లెత్తు మాట మొగుడిని అనెరగదు. ఏమిటో ఈ వయసలాంటిది. ఒక వేళ తిరిగినా మరో రెండేళ్ళు పోతే బాధ్యతలు పెరిగి, ఆ మోజు తీరి పోతే వాళ్ళే మానేస్తారు. అయినా, ఎవరో చెప్పినవి నమ్మడం ఏమిటి? ఏడుపులు, చుప్పనాతితనాలు ఈ ఊళ్లో వాళ్ళకి, లేని పోనివి కల్పించి చెప్పి కాపురాలలో చిచ్చు పెడతారు వాళ్ళంతా. ఆ పిచ్చి వాగుళ్ళు నమ్మి నీ కాపురాన్ని రోడ్డు నెట్టుకోకు. ఏదో సరదాగా వెళ్ళుంటాడు. వాడినే అడగబోక. బాధపడతాడు! ఇంకా పిచ్చి, పిచ్చి ఆలోచనలు మాని వెళ్ళి పడుకో!!" అంటూ మంచం మీదకి వాలి, ముసుగు తన్నిన కామాక్షమ్మ గారిని చూస్తూ మూగదానిలా బైటి కొచ్చింది రూప.

కలువబాల పక్షపత్రిక

**16 ఆగస్టు 1987**